క్లుప్తంగా

ఘనంగా దేశమ్మతల్లి వారాల పండగ



చినభీమవరంలో దేశమ్మతల్లి పండగ సందడి

బాడంగి: మండలంలోని భీమవరం, చినభీమవరం గ్రామాల్లో దేశమ్మతల్లి వారాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఘటాలకు భక్తులు పూజలు చేశారు. అనంతరం పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు వీధుల్లో ఘటాల తిరువీధి చేపట్టారు.

బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గారావు

రాజాం: మండల ఎంఈఓ–1గా పి.ప్రవీణ్‌కుమార్ శనివారం, ఎంఈఓ–2గా వై.దుర్గారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని, విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా చూస్తామని వారు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని పి.వెంకోపేట గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై, వాసిరెడ్డి శ్రీదేవి మృతి చెందింది. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఆదివారం కలిసి, పరామర్శించారు. ప్రభుత్వం పరంగా రావాల్సిన ఆర్థికసాయంతో పాటు అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు

రాజాం: మండలంలోని ఆగూరు, కంచరాం గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ బి.శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగూరులో ఒకటి, కంచరాంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇప్పటికే వీటికి సంబంధించి, నోటిఫికేషన్ కూడా ఇచ్చామన్నారు. మొత్తం ఐదుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, త్వరలోనే ఇంటర్వ్యూలు నిర్వహించి, నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

నారుమడుల్లో ఎరువులు వేయొద్దు

రేగిడి: ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్న వరి నారుమడుల్లో రసాయనిక ఎరువులు వేయవద్దని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని అంబఖండి, ఉంగరాడ, వండానపేట తదితర గ్రామాల్లోని వరి నారుమడులను పరిశీలించిన ఆయన ప్రస్తుతం వాతావరణం ప్రతికూలంగా ఉందని, ఈ సమయంలో రసాయనిక ఎరువులు వేస్తే పంట పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయం చేయాలని కోరారు.

జిల్లా కమిటీల ఏర్పాటుకు చర్యలు

బొబ్బిలి: ఏపీ మాజీ సైనిక సంక్షేమ సమితి జిల్లా కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన ఈ నెల 10వ తేదీన ఏర్పాటు కానున్న పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా కమిటీల్లో ఎవరైనా ప్రాతినిధ్యం వహించాలనే ఆసక్తి ఉన్న వారు ఫోన్ నంబర్ 9399095329ను సంప్రదించి, వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: అగ్రిగోల్డ్ బాధితుల కు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉత్తరాంధ్ర జిల్లాల గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక అమర్ భవన్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూరప్పడు ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఆగస్టు 15వ తేదీలోగా బాధ్యులకు పూర్తి న్యాయం చేయాలని.. లేకుంటే 30వ తేదీన విజయవాడలో భారీ ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, సీపీఐ జిల్లా కార్య దర్శి ఒమ్మి రమణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షు డు ఎస్. రమేష్, పాల్గొన్నారు.



రాజాం ఆర్‌టీసీ బస్టాండ్

- రాజాం బస్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం
- రూ.1.48 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- మున్సిపల్ శాఖ నుంచి రెండెకరాల స్థలం సేకరణ
- సకల సౌకర్యాలతో విశాలమైన కాంప్లెక్స్ భవనాలు
- ఈ నెల 11న రాష్ట్ర మంత్రుల చేతులమీదుగా పనుల ప్రారంభం

ఆధునిక హంగులతో కొత్త బస్టాండ్

ఎన్నో ఏళ్ల నాటి రాజాం ప్రాంత వాసుల కల నెరవేరబోతోంది. కొత్తగా ఆర్‌టీసీ బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు షురూ చేసింది. రెండెకరాల విస్తీర్ణంలో సకల సౌకర్యాలతో విశాలమైన కాంప్లెక్స్ భవనాలు నిర్మించనుంది. దీనికోసం 1.48 కోట్ల నిధులను ఇప్పటికే జగన్ సర్కారు మంజూరు చేయగా, ఈ నెల 11న రాష్ట్ర మంత్రుల చేతులమీదుగా పెద్దఎత్తున పండగ వాతావరణంలో పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



కొత్త బస్టాండ్ నిర్మాణానికి ఇప్పుడున్న బస్టాండ్ పక్కనే గుర్తించిన రెండెకరాల స్థలం

రాజాం: స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ గత 50 ఏళ్లుగా మున్సిపల్ శాఖకు చెందిన స్థలంలో కొనసాగుతూ వస్తోంది. ఇన్నాళ్లు బస్టాండ్‌కు కనీసం సొంత స్థలం కూడా లేకపోవడంతో ఆర్‌టీసీ సిబ్బందికి గానీ, ప్రయాణికులకు గానీ మౌలిక సదుపాయాలు కల్పించడం జరగలేదు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మినహా అక్కడ మరే ఇతర సౌకర్యాలు లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే కంబాల జోగులు చొరవతో కొత్త బస్టాండ్ నిర్మాణానికి సొంత స్థలం లభించింది. దీంతో ఆధునిక హంగులతో కొత్తగా భవన సముదాయాల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌టీసీ విలీనం తర్వాతే..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారమే ప్రభుత్వంలో ఆర్‌టీసీని విలీనం చేశారు. ఆ తర్వాత అంచెలంచెలుగా సొంత స్థలంలో రాజాం బస్టాండ్ నిర్మాణమనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఫలితంగా మున్సిపల్ కార్యాలయం పరిధిలో ఉన్న స్థలం(ఇప్పుడున్న బస్టాండ్) ఆనుకుని, కొత్తగా బస్టాండ్ నిర్మాణానికి రెండెకరాల స్థలం మంజూరైంది. దీనికి మున్సిపల్ శాఖ కూడా ఆమోదం తెలపడం విశేషం. ఇదంతా ప్రభుత్వంలో ఆర్‌టీసీ విలీనం కావడం వల్లే సాధ్యమైందన్నది వాస్తవంగా స్థానికులు మాట్లాడుకుంటుండడం గమనార్హం.

సరికొత్త రూపురేఖలు..

దాదాపు రూ.1.48 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ కొత్త బస్టాండ్‌లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. విశాలమైన గదులతో కొత్త బస్టాండ్ నిర్మాణం, ఇదే బస్టాండ్‌లో విశ్రాంత గదులు, టాయిలెట్స్, లెట్రిన్స్ నిర్మించనున్నారు. ఇన్‌గేట్, అవుట్‌గేట్‌ల దారి కూడా విశాలంగా ఉండేలా బస్టాండ్‌కు సరికొత్త రూపురేఖలు తీసుకురానున్నారు.

మంత్రుల చేతుల మీదుగా..

ఈ నెల 11వ తేదీన రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, పినెపు విశ్వరూప్ చేతుల మీదుగా బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2017లో చంద్రబాబు మాటిచ్చి, మరిచారు..

2017లో రాజాం ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు భారీ బహిరంగసభ ఏర్పాటు చేశారు. రాజాం ప్రాంతానికి ఎన్నో హామీలు ఇచ్చారు. వీటిలో రాజాం రోడ్డు విస్తరణతో పాటు రాజాం ఆర్‌టీసీ బస్టాండ్ నిర్మాణం కూడా ఉన్నాయి. ఆయన అధికారంలో ఉన్నంతవరకు వాటిని మరోసారి గుర్తుకు తెచ్చుకుని, పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. మళ్లీ 2019 జనవరిలో జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో భాగంఆ మళ్లీ రాజాం వచ్చిన చంద్రబాబు పొగిరి జెడ్పీ హైస్కూల్ వద్ద సమావేశం నిర్వహించి, రాజాం ప్రాంత అభివృద్ధి పనుల ప్రస్తావన లేవనెత్తకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీనే ఆ రెండు హామీలను నెరవేరుస్తోంది. ఇప్పటికే రూ.40 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతోంది. మళ్లీ ఇప్పుడు బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులు జరిగేలా చర్యలు తీసుకుంటోంది.

ఇది శుభపరిణామం..

బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం, నిధులు మంజూరు చేసింది. ఇది శుభపరిణామం. పనుల ప్రారంభానికి కూడా చర్యలు తీసుకుంటుండడంతో త్వరలోనే పనులు చకచకా జరుగుతాయి. ప్రజలకు అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి భవన సముదాయాలు వస్తాయి.

– సీహెచ్ అప్పలనారాయణ, ఏపీఎస్‌ఆర్‌టీసీ డీపీటీఓ, విజయనగరం.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి బొత్ససత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొని, మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో వివిధ పుస్తకాలు చదివించడం, బొమ్మలు వేయించడం, కథలు చెప్పించడం, రాయించడం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో ప్రతీ ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించి, విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందిస్తోందని తెలిపారు. ప్రతీ విద్యార్థి ఈ కార్యక్రమానికి హాజరై, కొత్త కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలు, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలపై కూడా దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఏకేఎల్ గెడ్డను బాగు చేయండి

రేగిడి: పూడికలు, జంగిల్స్(పిచ్చిమొక్కలు)తో రోజురోజుకూ కుంచించుకుపోతున్న ఏకేఎల్(ఆకులోవ కట్ట) గెడ్డను బాగు చేయండి అని రైతులు కోరుతున్నారు. మండలంలోని ఉనుకూరు–కొత్తచెలికానివలస గ్రామాల మధ్య వెయ్యి ఎకరాలకు సాగునీరు ఈ గెడ్డ ద్వారానే అందుతోంది. అయితే ప్రస్తుతం గెడ్డ గట్టు పొడవునా గడ్డి, పిచ్చిమొక్కలు విపరీతంగా పేరుకుపోయి గెడ్డలోపలి భాగం ఆక్రమిస్తున్నాయని, దీంతో సాగునీటి సరఫరాకు అడ్డంకి ఏర్పడుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడకముందే గెడ్డను బాగుచేస్తే వరదనీరు సాఫీగా ప్రవహించే అవకాశం ఉందన్నారు.



వెంకంపేట వద్ద కుంచించుకుపోయిన ఏకేఎల్ గెడ్డ

ప్రారంభానికి పీహెచ్‌సీ సిద్ధం



కొత్తగా నిర్మించిన చల్లపేట పీహెచ్‌సీ భవనం

మెంటాడ: మండలంలోని చల్లపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం) ప్రారంభానికి సిద్ధమైంది. ఇదివరకు శిథిలావస్థకు చేరుకున్న ఇక్కడి పీహెచ్‌సీలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది, చికిత్స పొందుతున్న రోగులు బిక్కుబిక్కుమని కాలం గడిపేవారు. ఏ చిన్నపాటి వర్షం కురిసినా ఆస్పత్రిలోని మందులు తడిసిముద్దయ్యేవి. ఇదే విషయాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లగా, నూతన భవనం నిర్మాణానికి రూ.1.73 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. దీన్ని ఇదే నెలలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి విడదల రజని చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిధులు రాకుండా శిలాఫలకాలు వేసింది మీరు కాదా?

- బస్సుయాత్రలో టీడీపీ నేతల అబద్ధాలపై ఎమ్మెల్యే శంబంగి ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఏదైనా అభివృద్ధి పని చేసుకోవాలంటే ముందు నిధులు మంజూరు కావాలని, నిధులు మంజూరు కాకుండానే సీఎం పేరుతో శిలాఫలకాలు వేసింది మీరు కాదా అని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు టీడీపీ నేతలపై మండిపడ్డారు. టీడీపీ బస్సుయాత్రలో ఆ పార్టీ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు. ఇదే విషయమై ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాముడువలస, లోచర్ల గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలని తాను అసెంబ్లీ, జెడ్పీ సమావేశాల్లో అడుగుతున్నానని, ఈ విషయం మీడియాకి, ప్రజలందరికీ తెలుసన్నారు. గతంలో భోగాపురం ఎయిర్‌పోర్టుకు కూడా నిధులు మంజూరు చేయకుండానే శిలాఫలకం వేసి, సభ పెడితే ఆ శాఖ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు సైతం ఆ సభకు గైర్హాజరైన విషయం అందరికీ తెలుసన్నారు. వాస్తవానికి ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లోపం వల్ల పాడవుతున్నాయని, వాటి నిర్మాణానికి ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బందీ లేదని, నిర్వహణే సమస్యన్నారు. అందుకే ప్రభుత్వం సాధ్యాసాధ్యాలపై ఆలోచిస్తోందన్నారు. దీనిపై తాను కూడా కమిటీలు వేసి, రైతులు నిర్వహించుకుంటారని ప్రభుత్వానికి, యంత్రాంగానికి తెలియజేసి, నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నానన్నారు. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపడతామన్నారు. పార్టీ ఉనికి కోసం బస్సు యాత్ర మొదలుపెట్టి, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు.

నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరు..

గతంలో మీ పార్టీ, మీ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్లే ప్రజలు మిమ్మల్ని పక్కనబెట్టారని, మరోసారి ప్రజలను మోసగించేందుకు సిద్ధమైతే మళ్లీ మిమ్మల్ని నమ్మేందుకు వారు సిద్ధంగా లేరన్నారు. టీడీపీ ప్రభుత్వం జిల్లాలో రైతులకు బకాయి పెట్టిన రూ.80 కోట్లను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని చెల్లించిన విషయం మీ కంటే రైతులకు బాగా తెలుసన్నారు. టీడీపీ కథ ముగిసిందన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న టీడీపీ నాయకులు వాటిని మేమే పూర్తి చేశామనడం ఎంత అబద్ధమో జనానికి తెలుసన్నారు. 20 శాతం దాటని నిర్మాణాలున్న టిడ్కో కాంట్రాక్టులన్నింటినీ రద్దు చేసి, కొత్త కాంట్రాక్టులు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. వాటిని తాము పూర్తి చేస్తే టీడీపీ వాళ్లు అక్కడికి వెళ్లి, ఫొటోలు తీసుకోవడం హాస్యాస్పదమన్నారు. 20 శాతం నిర్మాణాలున్నప్పుడు, పునాదులప్పుడు ఈ సెల్ఫీలు తీసుకోవాల్సిందని ఎద్దేవాచేశారు. గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, అగ్రి ల్యాబ్‌లు వంటివి ప్రభుత్వం తీసుకువచ్చి, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో ప్రజారంజకపాలన కొనసాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు) తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సివిల్ సర్వీస్ శిక్షణకు అవకాశం

రాజాం సిటీ: సివిల్ సర్వీస్ అభ్యర్థులకు చేదోడుగా ప్రేరణ పేరుతో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ సువర్ణావకాశం కల్పిస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఫౌండేషన్ రాజాం శాఖ ప్రతినిధి గగన్‌దీప్ ఆదివారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా పది మంది నిరుపేద అభ్యర్థులను పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నామని, ఈ నెల 23వ తేదీన జరగనున్న పరీక్షకు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్:// ఏపీఎస్‌ఏస్.ఏపీటీఓఎస్‌ఎల్‌ఐఎస్‌ఇ.ఐఎన్/ పీఆర్‌ఈఆర్‌ఏఎస్‌ఏ/ ఐఎన్‌డీఈఎక్స్.పీహెచ్‌పీ (httpr://aprra.apotnine.in/prerana/index.php) ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ తరఫున ఢిల్లీలో గానీ, హైదరాబాద్‌లో గానీ ప్రఖ్యాత శిక్షణ కేంద్రంలో ఉచితంగా కోచింగ్‌తో పాటు వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, పరీక్ష ఫీజు రూ.100గా నిర్ణయించామన్నారు. పరీక్షకు హాజరైన వారికి పరీక్ష ఫీజు కూడా వాపసు చేయనున్నామని, మరిన్ని వివరాలకు 8074402554కు సంప్రదించాలని కోరారు.

వేరుశనగ సాగుపై రైతుల ఆసక్తి

రేగిడి: మండలంలోని రైతులంతా వేరుశనగ పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంబఖండి, సోమరాజుపేట, లచ్చనవలస, తాటిపాడు తదితర గ్రామాల్లో పొలాల్లో వేరుశనగ విత్తనాలు వేస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా 30 శాతం రాయితీతో ఈ విత్తనాలు అందించినట్లు వ్యవసాయ శాఖాధికారి గురుగుబెల్లి మురళీకృష్ణ తెలిపారు. మండలంలో ప్రస్తుతం 230 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేశారని పేర్కొన్నారు.



అంబఖండిలో వేరుశనగ సాగు కోసం దుక్కి పనులు చేస్తున్న రైతు

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

రేగిడి: ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని బూరాడ జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించవద్దని, అధిక లోడులతో, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు.

సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి చర్యలు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. ఆదివారం సంపద తయారీ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి, స్థలం పరిశీలించారు. సర్పంచ్ గార రమణ సమక్షంలో కొలతలు నిర్ధారించారు. పనులు త్వరితగతిన ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



వన్నలిలో కొలతలు నిర్ధారిస్తున్న ఏపీఓ హరనాథరావు

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

రాజాం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎ.రేణుకాసాయి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పిల్లిపెసర, కట్టిజనుమ, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిని పొలాల్లో వేసి, మొక్కలు అయినప్పుడు దుక్కి చేసి, ఆ మొక్కలను నేలలో కలిపేయాలన్నారు. దీంతో నేల సారవంతమై పంటలు బాగా పండుతాయన్నారు. మండలంలో ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా 30 శాతం మంది రైతులకు ఈ విత్తనాలు అందజేశామని పేర్కొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రాజాం సిటీ: రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. స్థానిక పాలకొండ రోడ్డులో పాత స్తంభాలు తీసివేసి, కొలతల ప్రకారం రోడ్డు పక్కన కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఏఈ కుమార్ కోరారు.



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పక్కాగా జగనన్న సురక్ష సర్వే

రాజాం: మండల వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం సర్వే పక్కాగా జరుగుతోంది. గడిముడిదాం, దోసరిరామినాయుడువలస గ్రామాల్లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాల అర్హులతో పాటు జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణపత్రాలు కావాల్సిన వారి వివరాలు సేకరించారు. ఈ నెల 11వ తేదీన ఆయా గ్రామాల్లో జరిగే జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రజలు కోరుకున్న సిటిజన్ సర్వీసులను అందివ్వనున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాసూరి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.